నిబంధనలకు పాతర

- జీవ వ్యర్థాల నిర్వహణపై నిర్లక్ష్యం
- డంప్ యార్డుల్లో పడేస్తున్న వైనం
- తద్వారా వీధి కుక్కల స్వైరవిహారం
- ఆ రహదారిలో వెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



డంప్ యార్డు సమీపంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

గడివేముల: ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలు, రోడ్లను శుభ్రం చేయగా వచ్చిన చెత్తను ట్రాక్టర్లు లేదా బండ్లపై డంప్ యార్డుకు తరలిస్తారు. అయితే అన్ని చెత్తలను డంప్ యార్డులకు చేర్చకూడదు. ముఖ్యంగా జీవ వ్యర్థాలైన చికెన్, చేపలు, మటన్ వంటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోయకూడదు. వాటిని గోతులలో పూడ్చాలి. అయితే ఈ నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో డంప్ యార్డులలో జీవ వ్యర్థాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

చికెన్ దుకాణాల నుంచి డంప్‌యార్డులోకి...

ప్రస్తుతం చికెన్, మటన్ షాపులు ఎక్కడబడితే అక్కడ వెలుస్తున్నాయి. ఈ దుకాణాల నుంచి వ్యర్థాలను పర్యావరణహితంగా డంపింగ్ చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా గోతులు తీసి పూడ్చాలన్న స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. కానీ వీటిని వ్యాపారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. షాపుల వద్ద ప్లాస్టిక్ టిన్నులను ఏర్పాటు చేసి, ప్రతి రోజు అమ్మకాల కారణంగా వెలువడే జీవ వ్యర్థాలను సదరు ప్లాస్టిక్ టిన్నుల్లో వేసి తరువాత వాటిని తీసుకెళ్లి డంప్ యార్డుల్లో పడేస్తున్నారు. ఇలా పడేసిన జీవ వ్యర్థాలను తినడానికి పెద్దసంఖ్యలో కుక్కలు, పందులు, ఎలుకలు, పందికొక్కులు డంప్ యార్డుకు చేరుతున్నాయి. మండల కేంద్రంలో గడివేముల నుంచి బొల్లవరం రస్తాలోని మద్దిలేరు సమీపంలో చెత్త డంప్ యార్డు ఏర్పాటు చేశారు. అక్కడే చికెన్, మటన్ వ్యర్థాలను తీసుకొచ్చి వేయడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఆ రహదారిలో మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాల విద్యార్థులు, సిబ్బంది, బొల్లవరం, ఒండుట్ల, పైబోగుల గ్రామాల కూలీలు నిత్యం వందలాది మంది తిరుగుతుంటారు. డంప్ యార్డు నుంచి దుర్వాసనతో పాటు వీధి కుక్కలు అధికంగా సంచరిస్తూ బైకులకు అడ్డంగా రావడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

పర్యవేక్షణ కరువు

మాంసాహారం కోసం విక్రయించే జీవాలకు పశువైద్యులు ఆరోగ్య పరీక్షలు చేయాలి, గ్రామాల్లోనైతే పంచాయతీ/రెవెన్యూ సిబ్బంది అనుమతితో అమ్మకాలు సాగించాలి. అయితే ఈ విధానం ఎక్కడా అమలవుతున్న దాఖలాల్లేవు. అమ్మకాలపై పర్యవేక్షణలోనే ఈ స్థాయి నిర్లక్ష్యం ఉంటే ఇక మాంసాహార షాపుల నుంచి వెలువడే వ్యర్థాలను డంపింగ్ చేయడంలో ఇంకెంత నిర్లక్ష్యం నెలకొంటుందో అర్థం చేసుకోవచ్చు. సంబంధిత యంత్రాంగం పర్యవేక్షణ లోపంతో విచ్చలవిడిగా షాపులు వెలుస్తున్నాయి. జోరుగా అమ్మకాలు సాగుతున్నాయి. అసలు ఈ తతంగమంతా తమకు ఏమాత్రం సంబంధం లేనిదిగా ప్రభుత్వ యంత్రాంగం చూస్తోంది.



డంప్ యార్డులో పడేసిన చనిపోయిన కోళ్లు (ఫైల్)

చర్యలు తీసుకోవాలి

మాంసం విక్రయించే షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను చెత్త డంపింగ్ చేసే చోట పడేస్తున్నారు. దీంతో అక్కడకు కుక్కలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. వాటిని తినడానికి పోటీపడుతూ గందర గోళం సృష్టిస్తున్నాయి. వాటిమధ్య జరిగే కొట్లాటతో జనం ఆ రహదారిలో వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు యోగా కార్యక్రమం

ఓర్వకల్లు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం సోమయాజుల పల్లె బ్రహ్మకుమారీస్ మ్యూజియంలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్య భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో కనీసం రెండు వేల మంది ప్రజలు యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. ఉదయం 7 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాల మేరకు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ప్రజల రాకపోకల నిమిత్తం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యోగాసనాల అనంతరం అల్పాహారం ఉంటుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా రెండో దశ ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీఓ శ్రీదేవి

కల్లూరు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 ఐఐటీ, మెడికల్ అకాడమీల్లో శిక్షణ పొందడానికి ఆదివారం నిర్వహించిన రెండో దశ ఎంపిక పరీక్ష ప్రశాంతంగా జరిగిందని చిన్నటేకూరు డాక్టర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, మెడికల్ అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప తెలిపారు. మొత్తం 540 మంది విద్యార్థులకు గాను 418 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. సాంఘిక సంక్షేమ గురుకులాల కర్నూలు జిల్లా డీసీఓ ఐ.శ్రీదేవి కేంద్రంలో జరుగుతున్న పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ప్రిన్సిపాల్ మహానంది, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం!



నిరుపయోగంగా ఉన్న భవనం

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడులో ఉన్న ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ కార్యాలయ భవనం గత కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారక ముందే అధికారులు స్పందించి ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకోవచ్చు కాదా? అని పెద్దపాడు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భవనం వినియోగంలో లేకపోవడం వల్ల బయట గోడలు, లోపల ఫ్లోరింగ్ కుంగిపోయ్యే అవకాశం ఉందని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరకముందే అధికారుల స్పందించి ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటే ప్రజాధనం నిరుపయోగం గాకుండా ఉంటుందని పేర్కొంటున్నారు.

రోడ్డును బాగు చేయండి సారూ!



చిన్నటేకూరు వద్ద దెబ్బతిన్న రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో ప్రధాన రోడ్డు మధ్య వరకు ఛిద్రమైంది. ఈ రోడ్డుపై బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు, అనుగొండ వరకు, చిన్నకొట్టాల, పెద్దకొట్టాల, నాగలాపురం మీదుగా కోడుమూరు, గూడూరు తదితర ప్రాంతాలకు చెందిన వాహనాలు తిరుగుతుంటాయి. అలాగే భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు మధ్య వరకు దెబ్బతినడం వల్ల ఎదురెదురుగా వాహనాలు వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది. అధికారుల స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జీజీహెచ్‌లో ల్యాబ్‌లను విస్తరించాలి

కర్నూలు(సెంట్రల్): 3 రాష్ట్రాలు, 9 జిల్లాల ప్రజల వైద్యానికి పెద్ద దిక్కుగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్ష లేకపోవడం సిగ్గుచేటని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే ఆసుపత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలతోపాటు ఉన్న ల్యాబ్‌లను విస్తరించి రక్త పరీక్షలను త్వరితగతిన చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ల్యాబ్‌ల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఆయా ల్యాబ్‌ల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వారం రోజుల నుంచి మండలంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో మునుముందు మరిన్ని వానాలొస్తే పత్తి, కంది, వేరుశనగ వంటి పంటలను సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. మండలంలోని పొలాల్లో ఎక్కడ చూసినా పంటల సాగు కోసం అవసరమైన సేద్యం పనులను రైతన్నలు జోరుగా చేస్తున్నారు. భూమిని దున్నడం, చదును చేయడం, ఎరువులు చల్లడం, పొలాల్లో ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలన్నింటిని ఏరివేసి పంట సాగుకు అనువుగా రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసి నష్టపోయినప్పటికీ, ఈ ఏడాదైనా వాతావరణం అనుకూలించి పంటలు పండకపోతాయా అన్న ఆశతో రైతన్నలు జోరుగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

కష్టపడే వారికే పదవులు



కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న కరిమద్దెల నాయకులు

గడివేముల: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసే వారికి పదవులు తప్పక లభిస్తాయని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ మండల సభ్యులను నియమించారు. ఈ మేరకు పదవులు పొందిన వారు ఆదివారం కాటసాని రాంభూపాల్ రెడ్డిని కల్లూరులోని ఆయన ఇంట్లో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు పొందిన వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలను ధైర్యంగా ఎదుర్కోవాలని అండగా ఉంటామన్నారు. ఉపాధ్యక్షుడు దాలుస్వామి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవేందర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పుల్లయ్య, శివారెడ్డి, అన్నెం మహేశ్వర్ రెడ్డి, దర్గా స్వామి, బాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

పాణ్యం: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త టైలర్ బాషా కుమార్తె నిశ్చితార్థం ఆదివారం జరిగింది. వేడుకలకు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్ష్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, బద్రీనాథ్‌రావు, మండలాధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డితోపాటు పలువురు పార్టీ నాయకులు, ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100 ఫోన్ చేయొచ్చు

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

పాణ్యం: మండల కేంద్రలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి 50కి పైగా జట్లు వచ్చాయన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.30 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. మ్యాచ్‌లను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి క్రీడాభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

పాణ్యం: మండల పరిధిలో పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ జరిగినట్లు ఏఈ మధుసూదన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు గత కొన్ని రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి వాటిలో ఉండే ఆయిల్‌ను దొంగిలించుకుపోతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

●నేరేడు పండు.. ఔషధాలు మెండు



బండిపై అమ్మకానికి ఉంచిన నేరేడు పండ్లు

కోడుమూరు రూరల్: వర్షాకాలం ప్రారంభంలో మాత్రమే అరుదుగా దొరికే నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. నేరేడు పండ్లలో కాల్షియం, ఐరన్, పొటాషియం, విటమిన్లు ఏ,సీ సమృద్ధిగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పెంచే ఎన్నో ఔషధ గుణాలుండడం, బీపీ, షుగర్‌ను తగ్గించే లక్షణాలు ఉండడంతో ప్రజలు విరివిగా ఈ పండ్లను కొంటున్నారు. కిడ్నీలో ఉండే రాళ్లను సైతం కరిగించే శక్తి ఉండడంతో వీటిని తినేందుకు మక్కువ చూపుతున్నారు. దీంతో ఆదోని, కోసిగి వంటి ప్రాంతాల నుంచి ప్రతి రోజు వ్యాపారులు తీసుకొచ్చి కోడుమూరులో విక్రయిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2001–2002లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకచోట కలిసి తమ 23 ఏళ్లనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అలాగే ఆనాడు గురువులు నేర్పిన పాఠ్యాంశాలు, క్రమశిక్షణ, క్రీడలు వంటి వాటి గురించి చర్చించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులు మురళీమోహన్‌రెడ్డి, జి.చంద్రమోహన్, నాగరాజు, బి.టి.చంద్రశేఖర్, రాంప్రసాద్‌రెడ్డి, కిశోర్, ఈశ్వర య్య, చిన్న మద్దయ్య, పుల్లయ్య, బ్రహ్మయ్య, మాధవస్వామి, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గార్గేయపురం రోడ్డును నిర్మించాలి

- రేపటిలోగా పనులు మొదలుపెట్టకపోతే జాతీయ రహదారిని దిగ్బంధిస్తాం
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఓర్వకల్లు: గార్గేయపురం నుంచి కేతవరం మీదుగా పూడిచెర్ల స్టేజీ వరకు రోడ్డు నిర్మాణ పనులను ఈ నెల 27వ తేదీలోగా మొదలు పెట్టాలని, లేని పక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు చేపట్టాలని గతంలో అనేకసార్లు అధికారులకు విన్నవించినా.. ఏ మాత్రం స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేతవరం గ్రామానికి కూతవేటు దూరంలో ఆదిమానవులు సంచరించిన ఆనవాళ్లు, చిత్రాలతో గుహలు ఉన్నాయని, ఓర్వకల్లు, నన్నూరు ప్రాంతాల నుంచి నందికొట్కూరు ప్రాంతంలోని గ్రామాలకు వెళ్లేందుకు అనేక మంది వాహనదారులకు ఈ రోడ్డు అనువుగా ఉంటుందని తెలిపారు. అలాంటి రోడ్డు పనులను అర్ధాంతరంగా నిలిపివేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజల సౌలభ్యం కోసం గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే, ఈ ప్రభుత్వంలో నిర్మాణ పనులు మొదలుపెట్టి, కమీషన్ల కోసమో లేక నిధుల కొరతనో తెలియదుగానీ పనులు నిలిపివేశారని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ నెల 27వ తేదీలోగా నిర్మాణ పనులను ప్రారంభించాలని, లేని పక్షంలో 27వ తేదీన పూడి చెర్ల మెట్ట వద్ద జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీధర్, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, చంద్రబాబునాయుడు, మధుసూదన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

7న కూర్మ జయంతి వేడుకలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కూర్మ జయంతి వేడుకల ఆహ్వాన పత్రికలను వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆదివారం రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణలో పాల్గొన్న లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడుతూ.. నల్లగుట్ట శ్రీ కూర్మ క్షేత్రం మహిమాన్వితమైన పుణ్య స్థలమన్నారు. భక్తులు క్షేత్రాన్ని సందర్శించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. క్షేత్ర కార్యనిర్వాహకులు ఏజీ నరేష్ మాట్లాడుతూ.. శేష శుద్ధ ద్వాదశి జూన్ 7వ తేదీన ఆస్పరి మండలం హలిగెర గ్రామంలోని స్వయంభూ నల్లగుట్ట శ్రీ కూర్మ క్షేత్రం 12వ కూర్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 7వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 27 సార్లు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హరికూర్మ గిరి ప్రదక్షిణ, నవ నాగుల పుట్టల పూజలు, కూర్మనారాయణ స్వామి పల్లకి సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వేడుకల్లో 12 మంది పూజ్య స్వామీజీలు పాల్గొంటారన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన బతుకులు

- ధోబీఘాట్‌లు లేక రజకుల అవస్థలు
- దుస్తులు ఉతకాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే
- నిరుపయోగంగా బోర్లు
- పట్టించుకోని అధికారులు



గార్గేయపురంలో శిథిలమైన ధోబీఘాట్



పనిచేయని బోరు



వాగులో బట్టలు ఉతుకుతున్న రజకుడు

కర్నూలు(రూరల్): కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజకులు బట్టలు ఉతకడానికి నానా అగచాట్లు పడుతున్నారు. కిలో మీటర్ల దూరంలోని తుంగభద్ర నది వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కోడూమురు నియోజకవర్గంలో సుమారు 10 వేల రజక కుటుంబాలు ఉన్నాయి. కర్నూలు మండల పరిధిలో గార్గేయపురం, బి.తాండ్రపాడు, రేమట, ఉల్చాల, గొందిపర్ల, ఇ.తాండ్రపాడు గ్రామాల్లో 2 వేల రజక కుటుంబాలు కుల వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. రజకుల సౌకర్యార్థం గార్గేయపురం గ్రామంలో 15 ఏళ్ల క్రితం ధోబీఘాట్ నిర్మించారు. రెండు బోర్లు వేసి నీటి తొట్టెను ఏర్పాటు చేశారు. అయితే ప్రసుత్తం నీటి తొట్టె పూర్తిగా పగిలిపోయింది. దోబీఘాట్ శిథిలావస్థకు చేరుకుంది. బోర్లలో మోటరు ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. వేసవికాలం కావడంతో బట్టలు ఉతకడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. దగ్గరలోని కాలువల్లో ఎక్కడా చుక్క నీరు లేకపోవడంతో బట్టలు ఉతకడానికి ఇబ్బందిగా మారింది. సమీపంలోని వాగుల్లో అరకొరగా వస్తున్న నీటిని ఒక గుంతలో నిల్వ ఉంచి బట్టలు ఉతుకుతున్నట్లు తెలిపారు. అయితే గుంతలో నిల్వ ఉన్న నీరంతా పాచి పట్టడంతో పాటు దుర్గంధం వస్తోందన్నారు. ధోబీఘాట్ వద్ద బట్టలు ఉతకలేక కిలోమీటర్ల దూరంలోని చెరువులు, తుంగభద్ర నది వద్దకు ఆటోలు, ఇతర వాహనాలను బాడుగకు తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. బట్టలు ఉతకడం ద్వారా వచ్చే ఆదాయం ఆటోల బాడుగలకే సరిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో గ్రామాల్లో ధోబీఘాట్‌లు, నీటి తొట్టెలు, బట్టలు ఉతకడానికి బండాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నిరుపయోగంగా ఉన్న బోరుకు మోటారును ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి దోబిఘాట్ వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

హామీని నెరవేర్చాలి



ఎన్నికల మేనిఫెస్టోలో రజకుల ధోబి ఘాట్‌లను నిర్మించి ప్రతి నెలా 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్‌లకు ప్రత్యేక నిధులు కేటయిస్తామన్నారు. గ్రామాల్లో అవసమైన మేరకు ధోబీ ఘాట్‌లను నిర్మాస్తామన్నారు. రజకుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను నేరవేర్చడం లేదు.

– సి.గురుశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రజక వృతిదారుల సంఘం

తొట్టెలను ఏర్పాటు చేయాలి



ధోబీఘాట్ వద్ద నీటి తొట్టెలు, బట్టలు ఉతకడానికి అవసరమైన బండలను ఏర్పాటు చేయాలి. నిరుపయోగంగా ఉన్న బోర్లలో మోటరు ఏర్పాటు చేస్తే నీటి సమస్య ఉండదు. అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలి. వేసవి కావడంతో నీరు లేక బట్టలు ఉతకడానికి కిల్లోమీటర్ల దూరం వెళ్లి బట్టలు ఉతుకుతున్నాం

–సి.వెంకటేశ్వర్లు, గార్గేయపురం

కులవృత్తే ఆధారం



బట్టలు ఉతికి వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. వేసవి కాలం కావడంతో చుట్టుపక్కల ఎక్కాడా నీళ్లు లేవు. దీంతో చేసేది లేక తుంగభద్ర నదికి వెళ్లి బట్టలను ఉతుక్కుంటున్నాం. అధికారలు మా కష్టాలను అర్థం చేసుకుని గ్రామాల్లో దోబిఘాట్‌లు నిర్మించి సౌకర్యాలు కల్పించాలి.

– నాగలక్ష్మి, ఇ.తాండ్రపాడు